రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:25 ఆదివారం
సహర్ 5:13 సోమవారం



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, అధికారులు

మూడు షిఫ్టుల్లో ఓట్ల లెక్కింపు

- జంబో బ్యాలెట్‌తో జాప్యం జరిగే అవకాశం
- పట్టభద్రుల ఓట్ల లెక్కింపునకు 21 టేబుళ్లు
- ఉపాధ్యాయుల నియోజకవర్గానికి 14 టేబుళ్లు

పట్టుభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థుల భవిష్యత్తును 2,50,328 ఓట్లు నిర్ణయించనున్నాయి. పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్లను లెక్కింపు కోసం జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు త్వరగా ముగిసినా, పట్టుభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు రెండు, మూడు రోజుల పాటు కొనసాగే అవకాశం ఉంది. దీంతో అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. మూడు షిఫ్టుల్లో ఓట్లు లెక్కించాలని నిర్ణయించారు. పట్టభద్రుల ఓట్ల లెక్కింపునకు 21 టేబుళ్లు, ఉపాధ్యాయుల ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లు సిద్ధం చేశారు. ప్రతి టేబుల్ వద్ద ఒక మైక్రో అబ్జర్వర్, సూపర్‌వైజర్, ఇద్దరు కౌంటింగ్ అసిస్టెంట్లు విధులు నిర్వహించనున్నారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూసేందుకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్

6

నల్లానీటిని వృథా చేస్తే రూ.500 జరిమానా

- మంచినీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి
- నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

కరీంనగర్ టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నల్లానీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని, ఎవరైనా నల్లాలకు ఆన్‌ఆఫ్ బిగించకుండా నీటిని వృథా చేస్తే రూ.500 జరిమానా విధించాలని అధికారులను నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. నగరపాలక సంస్థ సమావేశమందిరంలో నీటి సరఫరా విభాగం, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బందితో మంచినీటి సరఫరాపై ఆమె శనివారం సమీక్ష నిర్వహించారు. వేసవి ప్రారంభమైనందున నగర పాలక సంస్థ పరిధిలో మంచినీటి సమస్యలు తలెత్తకుండా ప్రణాళికలు రూపొందించుకొని అవసరమైన చర్యలను తీసుకోవాలన్నారు. ఎక్కడైనా నల్లాలకు మోటార్లను బిగించి నల్లానీటి చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీటి సరఫరా పర్యవేక్షణ కోసం రిజర్వాయర్ల వారిగా డీఈ, ఏఈ, సిబ్బందితో కలిసి ప్రత్యేక టాస్క్‌ఫోర్సు ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ టాస్క్‌ఫోర్సు బృందం ప్రతి రోజు ఒక ప్రాంతంలోకి నల్లానీటి సరఫరాను పర్యవేక్షించాలని, ఎక్కడైనా లీకేజీలు, ఇతర సమస్యలుంటే వాటిని గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. రిజర్వాయర్లలో విద్యుత్ మోటార్లను స్టాండ్‌బైగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విలీన గ్రామాల్లో భగీరథ నీరు తగ్గితే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలన్నారు. నగర ప్రజలు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని, ఆస్తిపన్నులను, నల్లా బిల్లులను చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు. సమావేశంలో ఈఈ యాదగిరి, డీఈలు లచ్చిరెడ్డి, వెంకటేశ్వర్లు, అయూబ్‌ఖాన్, ఏఈలు, ఫిట్టర్లు, లైన్‌మెన్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్ల సమ్మె

- ప్రయాణికుల ఇబ్బందులు



కరీంనగర్ బస్టాండ్‌లో ధర్నా చేస్తున్న అద్దె బస్సుల డ్రైవర్లు

భగత్‌నగర్, మార్చి 1 (ఆంధ్ర జ్యోతి): కరీంనగర్ డిపో-1, డిపో-2లకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్లు శనివారం సమ్మెకు దిగారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కరీంనగర్-1 డిపోనకు చెందిన సురేష్ అనే అద్దె బస్సు డ్రైవర్ శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్ ఇన్‌గేట్ వద్ద జి సురేష్ ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. తాను మద్యం సేవించకున్నా బ్రీత్ ఎనలైజర్ పరీక్షలో పర్సంటేజీ ఎక్కువగా వస్తుందని అధికారులు డ్యూటీలు వేయడం లేదని అతడు ఆరోపించాడు. అక్కడే ఉన్న సెక్యూరిటీ సిబ్బంది సురేష్‌ను అడ్డుకున్నారు. 2023 సంవత్సరం సెప్టెంబరు 24న సురేష్‌కు నిర్వహించిన బ్రీత్ ఎనలైజర్ పరీక్షలో మోతాదుకు మించి మద్యం సేవించినట్లు వెల్లడైంది. తాను మద్యం సేవించలేదని, అయినా బ్రీత్ ఎనలైజర్ పరీక్షలో మద్యం సేవించనట్లు చూపిస్తోందని సురేష్ ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. సెప్టెంబరు నుంచి తనకు డ్యూటీలు వేయడం లేదని ఆవేదన చెందిన సురేష్ ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. విషయం తెలుసుకున్న అద్దె బస్సుల డ్రైవర్లు బస్టాండ్‌కు చేరుకుని సురేష్‌కు మదతుగా ధర్నా నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి సమ్మెకు దిగారు. దీంతో పలు బస్సులు నిలిచిపోయాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీ అధికారులు అద్దె బస్సుల డ్రైవర్లతో చర్చలు జరుపుతున్నారు. శనివారం రాత్రి వరకు చర్చలు కొలిక్కి రాలేదు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

- 5 నుంచి పరీక్షలు.
- పరీక్షలు రాయనున్న 35,562 మంది విద్యార్థులు
- ఒక్క నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- ఉదయం 8.15 గంటలకే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి

కరీంనగర్ టౌన్, మార్చి 1: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు జిల్లా అధికారయంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈనెల 5 నుంచి ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలతో ప్రారంభమై మార్చి 22 వరకు జరిగే పరీక్షలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.



జిల్లా వ్యాప్తంగా 58 పరీక్షా కేంద్రాలు

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, మోడల్, సోషల్ వెల్ఫేర్, మైనార్టీ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న 35,562 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు 58 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 17,799 మంది ఫస్ట్ ఇయర్ పరీక్షలు రాస్తుండగా 17,763 మంది విద్యార్థులకు సెకండ్ ఇయర్ పరీక్షలకు హాజరు కానున్నారు. పరీక్షలను ప్రశాంతంగా నిర్వ హిం చేందుకు 58 పరీక్షా కేంద్రాలకు ఒక్కొక్కరు చొప్పున 58 మందిని చీఫ్ సూపరింటెం డెంట్లను, 58 మంది డిపార్టుమెంట్ అధికారులను నియ మించారు. ఎలాంటి పొరపాట్లు, కాపీయింగ్‌కు ఆస్కారం లే కుండా ఏర్పాట్లు చేశారు. మూడు ఫ్లయింగ్ స్క్వాడ్, నాలుగు సిట్టింగ్ స్క్వాడ్, పోలీసు, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ల నుంచి ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఉదయం 8.15 నుంచి పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతిస్తారు.. ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా లోనికి అనుమతించరు.

జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ ఏర్పాటు

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి డీఐవో కన్వీనర్ జగన్మోహన్‌రెడ్డిగా వ్యవహరిస్తుండగా ఇద్దరు ప్రిన్సి

మిగతా 8వ పేజీలో...

విద్యార్థులకు సూచన

ఇంటర్ పరీక్షలు ఈ నెల 5 నుంచి ప్రారంభం కాబోతున్నాయి.. ఇన్నాళ్లు కష్టపడి చదువుకున్నారు. మరో 15 రోజులపాటు కష్టపడండి. ఇది మీ జీవితంలో కీలకమైన సమయం. మీ దృష్టిని ఎటూ మళ్లించకుండా జాగ్రత్తపడండి. ఉదయం తొమ్మిది గంటలకు పరీక్షలు ప్రారంభమైనా.. 8.15 గంటకే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు. కాబట్టి కాస్త ముందుగానే ఇంటి నుంచి బయలుదేరండి. కేంద్రంలోకి త్వరగా వెళితే అక్కడి వాతావరణానికి అలవాటు పడవచ్చు. పరీక్ష సమాయానికే వెళితే మధ్యలో ఏవైనా ఆటంకాలు ఎదురవ్వవచ్చు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోమని అధికారులు తేల్చిచెప్పారు. కాబట్టి ఈ ఒక్క నిమిషం నిబంధనను గుర్తుంచుకోండి. ధైర్యంగా ముందడుగు వేసి విజయాన్ని సాధించండి.



- పోటాపోటీగా ఫిర్యాదులు
- నగరపాలక సంస్థలో ముదురుతున్న వివాదం

కరీంనగర్ టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) రొడ్డ యాదగిరి, నగరపాలక సంస్థ రిజిస్టర్ కాంట్రాక్టర్ల మధ్య మొదలైన వివాదం రోజురోజుకు రాజుకుంటోంది. విధి నిర్వహణలో ఉన్న తనను కులం పేరుతో దూషించారంటూ ఈఈ యాదగిరి సీనియర్ కాంట్రాక్టర్ వరాల నారాయణపై పోలీసు స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టడం ఈ వివాదానికి తెరలేపింది. చేసిన పనులకు సంబంధించిన లక్షలాది రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నానని, పెండింగ్ బిల్లులు ఇప్పించాలని ఈఈ రొడ్డ యాదగిరి వద్దకు వెళ్లగా ఆయనే తనతో దురుసుగా మాట్లాడారని కాంట్రాక్టర్ వరాల నారా యణ మున్సిపల్ కమిషనర్, జిల్లా కలెక్టర్, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. బిల్లుల కోసం వస్తే ఎందుకు తన పట్ల ఇలా వ్యవహరిస్తున్నారంటూ ప్రశ్నించడంతో తనపై అక్రమ కేసు పెట్టించాడని ఆరోపించారు. మరోవైపు కాంట్రాక్టర్ల సంక్షేమ సంఘం ఈ వివాదంలో జోక్యం చేసుకొని కేసులు ఉపసంహరించుకోవాలని సూచించింది. ఫిర్యాదులు చేసుకోవడంతో అధికారులు, కాంట్రాక్టర్ల మధ్య సఖ్యత లోపిస్తుందని, ఇది నగర అభివృద్ధిపై ప్రభావం పడుతుందంటూ సూచించగా కాంట్రాక్టర్ నారాయణ వెనక్కి తగ్గారు. ఈఈ యాదగిరి వెనక్కి తగ్గ లేదు.

ఈఈపై కలెక్టర్‌కు, మంత్రులకు ఫిర్యాదు

కాంట్రాక్టర్ల సంక్షేమ సంఘం శుక్రవారం కలెక్టర్‌కు ఈఈపై ఫిర్యాదు చేసింది. ఈఈగా పనిచేస్తున్న యాదగిరి బినామీల పేరుతో అభివృద్ధి పనులు చేస్తున్నారని, బిల్లుల కోసం వెళితే తమను వేదిస్తున్నారని, ఆయనపై చర్య తీసుకోవాలని కోరారు. శనివారం మంత్రులు, ఇతర మున్సిపల్ ఉన్నతాధికారు లకు కూడా ఫిర్యాదు చేసినట్లు కాంట్రాక్టర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు దుగ్గు మహేందర్ తెలిపారు. అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో వెళ్లకుండా వివాదాన్ని మరింత తీవ్రం చేయడంతో అభివృద్ధి పనులపై ప్రభావం పడే అవకాశాలుంటాయని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. ఇప్పటికే పెండింగ్ బిల్లుల కోసం నగరపాలక సంస్థ జనరల్ ఫండ్ నిధులతో చేపట్టే పనులు చేసేందుకు ఆసక్తి చూపక పోవడంతో పార్ట్ పేమెంట్‌తో పనులు చేయిస్తున్నారు. ఈ వివాదాన్ని కలెక్టర్, మున్సిపల్ ప్రత్యేకాధికారి పమేలా సత్పతి, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ సీరియస్‌గా తీసుకొని విచారణ జరిపించాలని పలువురు సూచిస్తున్నారు.

లింగ నిర్ధారణ చేస్తే చర్యలు

- ప్రత్యేక బృందం ద్వారా స్కానింగ్ సెంటర్ల తనిఖీ
- డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ

సుభాష్‌నగర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ హెచ్చరించారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో గర్భస్థ పూర్వ, గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం-1994పై జిల్లా సలహా కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో స్పెషల్ డ్రైవ్ కింద ప్రత్యేక బృందం ద్వారా తనిఖీలు చేపడతామన్నారు. ఈ బృందంలో ఒక గైనకాలజిస్టు, మహిళ తహసీల్దార్, మహిళ పోలీసు అధికారి, పీసీ, పీఎన్‌డీటీ ప్రోగ్రాం అధికారి, సఖి కన్సల్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉంటారని తెలిపారు. గర్భస్థ శిశువుగా ఉన్నప్పుడు స్త్రీ, పురుష లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే, పరీక్షలు చేసినవారికి, చేయించుకున్నవారికి, అందుకు ప్రోత్సహించిన వారికి చట్టప్రకారం మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష, పదివేల రూపాయల జరిమానా విధిస్తామని తెలిపారు. లింగ నిర్ధారణ చేయబోమని, పుట్టబోయే బిడ్డ ఆగ, మగ అని చెప్ప కూడదనే బోర్డులను స్కానింగ్ సెంటర్లలో ప్రదర్శించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, పీఓపీసీపీఎన్‌డీటీ సనాజవేరియా, డీటీసీవో రవిందర్‌రెడ్డి, పీవోటీటీ ఉమాశ్రీ, డీఐవో సాజిదఅతహరి, గైనకాలజిస్టు కె నిర్మల, పెడియాట్రిషియన్ కళ్యాణి, రేడియాలజిస్టు దివ్య, ప్రకృతి ఎన్‌జీవో రమాదేవి, ప్రశాంత్ భువన్, సిస్టర్ సిరిల్, సఖి కన్సల్టెంట్ డి లక్ష్మి, హెచ్‌ఈఈవో రాజగోపాల్, హెచ్‌ఈ కైక, ఎంపీహెచ్‌ఎస్(మేల్) సయిద్‌సాబీర్, డాటా ఎంట్రీ ఆపరేటర్ కె రమేశ్ పాల్గొన్నారు.



అన్నారంలో రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభం

రోడ్డు వేశారు.. స్తంభాన్ని మరిచారు..

మానకొండూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మానకొండూర్-జమ్మికుంట డబుల్‌రోడ్డు నిర్మాణంలో భాగంగా మండలంలోని అన్నారంలో తారు రోడ్డు వేసి విద్యుత్ స్తంభాలు తొలగించలేదు. ఈ రోడ్డు పై నిత్యం ఆర్టీసీ బస్సులతో పాటు వందలాది ఇసుక లారీలు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు వెళుతుంటాయి. అన్నారం గ్రామంలో కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణం, మురికి కాల్వల నిర్మాణం అస్తవ్యస్తంగా చేసి చేతులు దులుపుకున్నాడు. రోడ్డు వేసి రెండేళ్లయిన విద్యుత్ స్తంభాలను తొలగించకపోవడంతో ప్రయాణీలు ఇబ్బందులు పడుతున్నారు. ఎదురెదురుగా వాహనాలు వస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని కోరుతున్నారు.

నేటి నుంచి రంజాన్ మాసం

కరీంనగర్ కల్చరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ముస్లింలు ఆచరించే ఉపవాస దీక్షల (రోజా) పవిత్ర రంజాన్ మాసం ఆదివారం నుంచి ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా ముస్లింలు ఉపవాసాలు పాటించడానికి సిద్ధమవుతున్నారు. ఈ మాసంలోనే ముస్లింల పవిత్ర గ్రంథమైన ఖురాన్ ఆవిర్భవించింది.



రోజా (ఉపవాసం) ప్రాముఖ్యం..

కోరికలను జయించడం, ఇంద్రియ నిగ్రహంతో హృదయాన్ని పరిశుద్ధంగా ఉంచుకోవడం రోజాలో భాగం. ఖురాన్ ఉపవాసాన్ని సహనంగా పేర్కొంది. రోజా డాలు వంటిదని, ఖడ్గపు వేటు పడకుండా రక్షిస్తుందని చెబుతారు. ఓర్పు, స్థైర్యం, త్యాగం, సౌశీల్యం, మృదుస్వభావం, ప్రేమాభిమానాలు, దయ, దాతృత్వం వంటి గుణాలను రోజా అలవర్చుతుంది. రంజన్‌లో ఐదు పూటల నమాజ్, ఇషావేళలో ఫర్జ్ తర్వాత అదనంగా 20 రకాల తరావీహ్ నమాజ్‌లు చేస్తారు.

నెలవంక దర్శనంతో నెలకొన్న సందడి

ఆకాశంలో శనివారం రాత్రి నెలవంక దర్శనమివ్వడంతో ముస్లింలలో సందడి నెలకొంది. రంజాన్ మాసం సందర్భంగా ఆదివారం నుంచి ఉపవాసాలు ఉండేందుకు ముస్లింలు సిద్ధమయ్యారు. మసీదుల్లో సైరన్‌లు మోగించి రంజాన్ మాసం ప్రారంభమవుతుందని మతపెద్దలు సూచించారు.నమాజ్ చేసుకునేందుకు మసీదుల్లో ఏర్పాట్లు చేశారు. ఫోన్లు, ఇంటర్‌నెట్‌ల ద్వారా బంధువులకు, మిత్రులకు, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపి రంజాన్ మాసాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునేందుకు సిద్ధమయ్యారు.

సహరీ.. ఇఫ్తార్

సూర్యోదయానికి ముందు తీసుకొనే భోజన పానీయాల సహరీ సమయంలో మేల్కొనకున్నా, సహరీ భుజించకున్నా ఉపవాసం పాటించాలి. ఆలస్యంగా భుజిస్తే ఆనాటి రోజా వ్యర్థం. సహరీ ఆఖరి వేళల్లో భుజించడం ఎంత పుణ్యమో సూర్యాస్తమయం తర్వాత ఉపవాసం విరమించేందుకు తినే ఇఫ్తార్ ప్రారంభంలో భుజించడం అంతే పుణ్యప్రదం.

మసీదుల్లో ఏర్పాట్లు..

రంజాన్ సందర్భంగా మసీదులను అలంకరించి ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు. సైరన్‌ల పని తీరులను పరిశీలించుకున్నారు. పలు దర్గాల్లో, మసీదుల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి.



కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన హరీస్ స్టాల్

ముస్తాబైన హరీస్ స్టాళ్లు

జిల్లా కేంద్రంలో హరీస్ స్టాళ్లు ముస్తాబయ్యాయి. కొన్ని స్టాళ్ల ఏర్పాట్లు నాలుగైదు రోజుల క్రితమే వెలసి వంటకాలను కూడా అందిస్తున్నాయి. నగరంలో సుమారు 15 నుంచి 20 వరకు హరీస్ స్టాళ్లు వెలియనుండగా హైదరాబాదీ, అరబ్ వంటకాలను కూడా అందజేయనున్నట్లు స్టాళ్ల బాధ్యులు తెలిపారు. కశ్మీరగడ్డ, రాజీవ్ చౌక్, కార్ఖానగడ్డ, ముఖరంపుర, రాంనగర్, మంచిర్యాల, జగిత్యాల రోడ్, గీతాభవన్ టు బస్టాండ్ రోడ్, మార్కెట్ వంటి ప్రాంతాల్లో అమ్మకాలకు సిద్ధమయ్యారు. మరో వైపు ఉపవాసానికి ముందు, తర్వాత తినేందుకు బాదాం, పిస్తా, ఖర్జూరా, సేమియా, వివిధ రకాల పండ్ల అమ్మకాల కోసం కూడా ప్రత్యేక సెంటర్లు వెలిశాయి. అన్ని వర్గాల ప్రజల రుచుల ఆస్వాదనతో స్టాళ్ల వద్ద, వ్యాపార నిలయాల వద్ద సందడి నెలకొననుంది. స్టాళ్లలో నిర్వాహకులు నోరూరించే వంటలను సిద్ధం చేసేందుకు ప్రణాళికలు రూపొందించుకున్నారు. స్టాళ్లను ముస్తాబుచేసి వివిధ రకాల వంటకాల రుచులతో కస్టమర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య

- సూసైడ్ నోట్‌ను కొంగున కట్టుకుని బావిలో దూకిన యువతి
- వేధింపులే కారణమని తల్లిదండ్రుల ఆరోపణ


పల్లవి (ఫైల్)

వేములవాడ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : అత్తింటి వారి వేధింపులు తట్టుకోలేక ఓ వివాహిత వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం చోటుచేసుకుంది. వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడరూరల్ మండలం అచ్చన్నపేట గ్రామానికి చెందిన కొక్కుల దేవరాజం కుమార్తె పల్లవి(23) వివాహం వేములవాడ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన మ్యాన శివుడు అనే యువకుడితో 2021లో జరిగింది. పెళ్లి అయిన కొద్ది రోజులకే భర్తతోపాటు అత్త విజయ, కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం వేధిస్తుండడంతో పలుమార్లు పంచాయతీలు జరిగాయి. అయినప్పటికీ వేధింపులు ఆగకపోవడంతో శనివారం తెల్లవారుజామున వేములవాడ పట్టణ శివారులోని చెక్కపల్లి రోడ్డులోగల ఓ వ్యవసాయ బావిలో దూకి పల్లవి ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహానికి ఉన్న చీర కొంగుకు పల్లవి రాసిపెట్టిన సూసైడ్ లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతురాలు తండ్రి దేవరాజం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరప్రసాద్ తెలిపారు.

మనస్థాపంతో ఒకరి బలవన్మరణం

బోయినపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కుల సంఘంలో తీసుకున్న చిట్టీ డబ్బులు సకాలం చెల్లించక మనస్థాపం చెందిన ఓవ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బోయినపల్లి మండలం మల్కాపూర్ గ్రామంలో శనివారం జరిగింది. ఎస్సై పృథ్వీధర్ గౌడ్ తెలిపినవివరాల ప్రకారం.. గ్రామానికిచెందిన పబ్బాల కొమురయ్య(55) కుల సంఘంలో 30వేల రూపాయల చిట్టీ డబ్బులు తీసుకున్నాడు. శనివారం కుల సంఘం సమావేశం ఉండడంతో తీసుకున్న డబ్బులను కొమురయ్య సకాలంలో చెల్లించే మార్గం కనిపించకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై వ్యవసాయ పొలం వద్ద ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ట్రాక్టర్ కిందపడి ఒకరి దుర్మరణం


ప్రశాంత్ (ఫైల్)

జమ్మికుంట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన బలవేణి ప్రశాంత్(32) ట్రాక్టర్ అదుపుతప్పి కెనాల్‌లో పడి శనివారం మృత్యువాతపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రశాంత్ తనసొంత ట్రాక్టర్‌పై పనుల నిమిత్తం జమ్మికుంటకు వస్తున్నాడు. మార్గమధ్యలో ధర్మారం వద్దకు రాగానే ట్రాక్టర్ కుడిటైర్ పగిలి అదుపు తప్పి కెనాల్‌లో పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ఇంజన్ భాగం ప్రశాంత్ మీద పడటంతో అక్కడికక్కడే మృత్యువాతపడ్డాడు. మృతుడి భార్య రమ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

చెరువులో పడి వృద్ధుడి మృతి

కరీంనగర్ క్రైం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కొత్తపల్లి చెరువులో పడి కొత్తపల్లికి చెందిన వృద్ధుడు రాపెల్లి రాజయ్య(88) మృతి చెందినట్లు కొత్తపల్లి పోలీసులు తెలిపారు. రాజయ్య శుక్రవారం బయటకు వెళ్లివస్తానని చెప్పి రాత్రి వరకు తిరిగి ఇంటికిరాలేదు. దీంతో ఆయన కొడుకు, బంధువులు రాజయ్య కోసం గాలిస్తూ కొత్తపల్లిలోని చెరువు వద్ద చూడగా అక్కడ అతని చెప్పులు, బట్టలు కనిపించాయి. అనుమానంతో చెరువులో గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. శనివారం ఉదయం గజఈతగాళలతో గాలించగా రాజయ్య మృతదేహం లభ్యమైంది. రాజయ్య బహిర్భూమికి వెళ్లి చెరువులో జారిపడి మృతి చెంది ఉంటాడని మృతుడి కొడుకు శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని కొత్తపల్లి పోలీసులు తెలిపారు.

తల్లి మందలించిందని.. యువకుడి ఆత్మహత్యాయత్నం

సుల్తానాబాద్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలం గట్టెపల్లి గ్రామానికిచెందిన హరీష్ అనేయువకుడు శనివారం మధ్యాహ్నం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. హరీష్ తల్లి రూ.500 వేరే వాళ్ళకి ఇచ్చి రమ్మని పంపించగా హరీష్ ఆ డబ్బులను మిత్రులతో కలసి మద్యం కోసం ఖర్చు చేశాడు. మద్యం తాగి వచ్చిన కొడుకును తల్లి మందలించింది. బయటికి వెళ్లిన హరీష్ క్రిమి సంహారక మందు తాగాడు. అనంతరం ఇంటి సమీపంలోని వారి ఇంటికివెళ్ళగా గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం హరీష్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

మూడు షిఫ్టుల్లో ఓట్ల లెక్కింపు

- జంబో బ్యాలెట్‌తో జాప్యం జరిగే అవకాశం
- పట్టభద్రుల ఓట్ల లెక్కింపునకు 21 టేబుళ్లు
- ఉపాధ్యాయుల నియోజకవర్గానికి 14 టేబుళ్లు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్లను లెక్కింపు కోసం జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. బ్యాలెట్ బాక్సులు భద్రపరిచిన కరీంగర్ అంబేద్కర్ స్టేడియంలోనే ఈ నెల 3న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. పట్టభద్రుల నియోజకవర్గంలో 2,50,328 మంది ఓటర్లు, ఉపాధ్యాయ నియోజక వర్గంలో 24,968 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పట్టభద్రుల నియోజక వర్గంలో 56 మంది అభ్యర్థులు పోటీలో ఉండ డంతో జంబో బ్యాలెట్ ఏర్పాటు చేశారు. దీంతో ఓట్ల లెక్కింపులో జాప్యం జరిగే అవకాశం ఉంది. కనీసం రెండు రోజులు ఓట్ల లెక్కి ంపు కొనసాగే అవ కాశం ఉండడంతో మూడు షిఫ్టుల్లో ఓట్ల లెక్కింపు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు.

పకడ్బందీ ఏర్పాట్లు

ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూసేందుకు పోలీసులు అంబేద్కర్ స్టేడి యం వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను చేశారు. కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతి పర్యవేక్షణలో జిల్లా యంత్రాంగం ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను పూర్తి చేసింది. పట్టభద్రుల ఓట్ల లెక్కింపు కోసం 21 టేబుళ్ళ, ఉపాధ్యాయుల ఓట్ల లెక్కింపు కోసం 14 టేబుళ్ల సిద్ధం చేశారు. ప్రతి టేబుల్ వద్ద ఒక మైక్రో అబ్జర్వర్, సూపర్‌వైజర్, ఇద్దరు కౌంటింగ్ అసిస్టెంట్లు విధులు నిర్వహించనున్నారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే సరికి రెండు, మూడురోజులు పట్టే అవకాశమున్నందున మూడు షిఫ్టుల్లో ఓట్ల లెక్కింపు చేపట్టేందుకు సిబ్బందిని నియమించారు.



అంబేద్కర్ స్టేడియం వద్ద పటిష్ట భద్రత

ఓట్ల లెక్కింపు చేసే హాళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూసేందుకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అంబేద్కర్ స్టేడియం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల పరిధిలోని 773 పోలింగ్ కేంద్రాల నుంచి తీసుకువచ్చిన బ్యాలెట్ బాక్సులను అంబేద్కర్ స్టేడియం స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచి, మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. బ్యాలెట్ బాక్సులను ఉంచిన గదుల ముందు మొదటి దశలో కేంద్ర బలగాలను, రెండో దశలో ఆర్మ్‌డ్ రిజర్వుడ్ బలగాలను 89 మందిని మోహరించారు. స్టేడియం చుట్టూ సివిల్ పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేసి పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసి పర్యవేక్షిస్తున్నారు. స్టేడియం బయట ప్రధాన ద్వారా వద్ద భారీ ఎల్‌సీడీ స్క్రీన్ ఏర్పా టు చేశారు. ఈ స్క్రీన్‌పై అభ్య ర్థులు బ్యాలెట్ బాక్సుల భద్ర తను పరిశీలించే వీలు కల్పించారు. ఓట్ల లెక్కింపు వద్ద శాంతిభద్రతలను పర్యవేక్షించేందుకు 400 మంది పోలీసు సిబ్బంది రెండు షిఫ్టుల్లో విధులు నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేశారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరికి గాయాలు

శంకరపట్నం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలంగూర్ ఎక్స్‌రోడ్‌లోని వీఎస్సార్‌గార్డెన్ సమీపంలో కుక్క అడ్డురాగా ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడి ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. సైదాపూర్ మండలం ఆరెపల్లిగ్రామానికి చెందిన గుంటి అయిలయ్య వ్యక్తిగత పనినిమిత్తం మండలంలోని కొత్తగట్టు గ్రామానికి వెళ్లి వస్తున్నాడు. మొలంగూర్ క్రాస్‌రోడ్‌లోని వీఎస్సార్‌గార్డెన్ సమీపంలో కుక్కలు పోట్లాడుకుంటున్నాయి. అయిలయ్య తన ద్విచక్ర వాహనం(టీవీఎస్ ఎక్సెల్)పై వస్తుండగా ఒకకుక్క అడ్డురాగా అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతోకుడిచేయి విరిగింది. గమనించిన స్థానికులు108లో కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ప్రమాదవశాత్తు యువకుడికి..

ఇల్లందకుంట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని రైస్‌మిల్ సమీపంలో బైక్‌పై వెళ్తున్న యువకుడు ప్రమాదవశాత్తు కారు ఢీకొని తీవ్రగాయాలపాలయ్యాడు. మండల కేంద్రానికి చెందిన శనిగరపు రాజు బైక్‌పై వెళ్తున్నాడు. ఇదే క్రమంలో ఒకవ్యక్తి బైక్‌పై వస్తున్న రాజును గమనించక కారు ఆపి డోర్‌తీశాడు. అనంతరం బైక్ కారుడోర్‌ను ఢీకొట్టింది. దీంతో రాజు తలకు తీవ్రగాయాల య్యాయి. వెంటనే స్థానికులు రాజును జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ఒకటి అంకెను మూడు రకాలుగా పరిగణలోకి తీసుకోవాలి

- ఎన్నికల కమిషన్, కరీంనగర్ ఆర్‌వోకు కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి రుద్ర సంతోష్ వినతి


రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న రుద్ర సంతోష్

కరీంనగర్ అర్బన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీకి జరిగిన పోలింగ్‌లో మొదటి ప్రాధాన్యత ఓటు విషయంలో ఒకటి అంకెను మూడురకాలుగా పరిగణించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి, టీపీసీసీ నేత రుద్ర సంతోష్ శనివారం రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు, జిల్లా ఎన్నికల అధికారికి విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు ఒకటి అంకెను మూడు రకాలుగా వేసిన విధానాన్ని వివరిస్తూ ఆయన ఒక వినతిపత్రాన్ని వారికి అందజేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి ప్రాధాన్యతా ఓటు వేసేందుకు పట్టభద్రుల ఓటర్లు ఒకటి అంకెను మూడు రకాలుగా రాయవచ్చని. ఆ మూడు రకాల అంకెలను వివరిస్తూ, మూడు రకాలుగా ఒకటి అంకెను ఎవరు రాసినా దానిని పరిగణలోకి తీసుకోవాలని కోరారు.

నేడు శ్రీపాదరావు జయంతి

- ఉమ్మడి రాష్ట్రంలో అసెంబ్లీ స్పీకర్‌గా సేవలు
- అధికారికంగా నిర్వహణ



మంథని, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): శాసనసభ మాజీ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి ఆదివారం జరగనుంది. శ్రీపాదరావు జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించనున్నారు. కాటారం మండలం ధన్వాడలో కమలాబాయి- రాధాకిష్టయ్యలకు మార్చి 2, 1937లో జన్మించారు. మంథని నియోజకవర్గం నుంచి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలుపొంది ఉమ్మడి రాష్ట్ర శాసన సభా స్పీకర్ స్థానాన్ని అలంకరించారు. స్వగ్రామమైన ధన్వాడ సర్పంచ్‌గా రాజకీయ ఆరంగేటం చేసిన ఆయన మహదేవపూర్ బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా, పొగాకు బోర్డు చైర్మన్‌గా, మంథని ఎల్ఎంటీ బ్యాంక్ చైర్మన్‌గా, డీసీసీలో, పీసీసీలో అనేక పదవులు నిర్వహించారు. 1983, 1985, 1989లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మంథని ఎంఎల్ఏగా గెలుపొందిన శ్రీపాదరావు ఉమ్మడి రాష్ట్ర శాసనసభా స్పీకర్‌గా నియమితులై 1994 వరకు కొనసాగారు. మంథని ప్రాంత అభివృద్ధి ప్రదాతగా ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. మహదేవపూర్ మండలం అన్నారం అటవీ ప్రాంతంలో శ్రీపాదరావును మావోయిస్టు 1999 ఏప్రిల్ 13న హత్య చేశారు. శ్రీపాదరావు భౌతికంగా దూరమై 24 యేళ్ల గడిచినప్పటికీ నేటికి ఇక్కడి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. నియోజకవర్గంలో శ్రీపాదరావు జయంతి నిర్వహణకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, ట్రస్టు చైర్మన్ దుద్దిళ్ళ శ్రీనుబాబు సన్నాహాలు చేపట్టారు.

మడేలేశ్వర స్వామి ఆలయంలో చోరీ

ముస్తాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండల కేంద్రంలోని మడేలేశ్వర స్వామి ఆలయంలో చోరీ జరిగింది. ఇటీవల మడేలేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ముగిసిన క్రమంలో దొంగలుపడ్డారు. దాదాపు 8 వేల రూపాయలను హుండీలో నుంచి ఎత్తుకెళ్లినట్లు రజక సామజికవర్గం నాయకులు తెలిపారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గణేష్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

బీర్‌పూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై బీర్‌పూర్ మండలం మంగేళ గ్రామానికి చెందిన గుర్రం శ్రీనివాస్(42) శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడని ఏఎస్సైరవీందర్ శనివారం తెలిపారు. శ్రీనివాస్ శుక్రవారం ఉదయం ఇంటినుంచి బయటకువెళ్లి ఇంటికి వచ్చి కింద పడిపోయాడు. తాను గడ్డిమందు తాగానని శ్రీనివాస్ కుటుంబసభ్యులకు తెలపడంతో భార్య లావణ్య ఆసుపత్రికి తీసుకువెళ్లి చికిత్సఅందిస్తుండగా శుక్రవారం సాయంత్రం మృతిచెందాడు. శ్రీనివాస్‌భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

అధిక వడ్డీకి అప్పు ఇస్తున్న వ్యక్తిపై కేసు

ఇల్లంతకుంట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామానికి చెందిన గడ్డమీది వెంకటేశంపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం వెంకటేశం గ్రామంలో అధిక వడ్డీలకు అప్పులు ఇస్తున్నాడనే సమాచారం మేరకు శనివారం ఇంటిలో సోదా చేశామన్నారు. ఇంటిలో ప్రామిసరీ నోట్స్ బాండ్‌లతోపాటు విలువైనపత్రాలు లభించినట్లుతెలిపారు. మండలంలోని ఏ గ్రామంలోనైనా అధిక వడ్డీలకు అప్పులు ఇచ్చినట్లయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

ఐదుగురిపై కేసు నమోదు

జమ్మికుంటరూరల్, మార్చి1(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నంకోసం తనఅత్తింటి వారు వేధిస్తున్నారని ఓవివాహిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం ఐదు గురిపై కేసు నమోదుచేశారు. పోలీసులుతెలిపిన వివరాలప్రకారం.. జమ్మికుంట మండలం వావిలాల గ్రామానికిచెందిన ప్రనూషకు 2017లో మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట్‌కు చెందిన వెలగందుల రాజేష్‌తో పెద్దలసమక్షంలో వివాహం జరిగింది. వివాహం జరిగిన మూడు నెలలుపాటు కలిసిమెలిసిఉన్నారు. అనంతరం రాజేష్ మరొకమహిళతో వివాహేతర సంబం ధం ఏర్పరుచుకున్నాడు. అప్పటి నుంచి తన భర్తతోపాటు అత్తవిజయలక్ష్మి, మామ సత్యనారాయణ, ఆడపడుచు అరవపల్లి లావణ్య, ఆడపడచుభర్త కిషోర్ అదనపుకట్నం తేవాలని వేధిస్తున్నారని ప్రనూష పేర్కొంది. బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

ముందస్తు అడ్మిషన్లు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలి



బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి

భగత్‌నగర్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): విద్యా సంస్థల్లో ముందస్తు అడ్మిషన్లుచేస్తే కేసులు నమోదు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి హెచ్చరించారు. శనివారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డిభవన్‌లో మాట్లాడుతూ రాష్ట్రంలో కొన్నివిద్యాసంస్థలు నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు చేస్తున్నాయని ఆకళాశాలల్లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అడ్డుకుంటామన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ బకాయిలు విడుదల చేయాలన్నారు. అధికారుల వత్తాసు వల్లే విద్యాసంస్థల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. సమావేశంలో జిల్లాకార్యదర్శి మచ్చరమేష్, నగరకార్యదర్శి మామిడిపల్లి హేమంత్, సందీప్‌రెడ్డి, వినయ్, అశోక్ పాల్గొన్నారు.

అక్షర చిట్‌ఫండ్స్ మోసానికి ఏజెంట్ బలి

- ఎఫ్‌డీ, చిట్ డబ్బులు రాక ఆత్మహత్య
- న్యాయం చేయాలంటూ చిట్‌ఫండ్స్ బాధితుల ధర్నా


ఆందోళన చేస్తున్న అక్షర చిట్ ఫండ్స్ బాధితులు


రాజు (ఫైల్)

కరీంనగర్ క్రైం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో అక్షర చిట్‌ఫండ్స్ మోసానికి ఆసంస్థ ఏజెంట్ బలయ్యాడు. బాధిత కుటుంబ సభ్యులు, చిట్‌ఫండ్స్ బాధితులు, పోలీసులుతెలిపినవివరాల ప్రకారం... కరీంనగర్‌జిల్లా కొత్తపల్లి మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన చింతలరాజయ్య అలియాస్ రాజు (39) అక్షర చిట్‌ఫండ్స్‌లో కొన్నేళ్లుగా ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. రాజయ్య స్వంతంగా చిట్‌వేయటంతోపాటు బంధువులు, పరిచయస్థులతో చిట్స్ వేయించాడు. చిట్ డబ్బులు ఇవ్వకుండా తనకు రావాల్సిన 5లక్షల రూపాయలకు ఎక్కువ వడ్డీ చెల్లిస్తామని నమ్మబలికి చిట్‌సంస్థ ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించుకుంది.గడువుముగిసినా డబ్బులు అందకపోవడంతో రాజయ్య ఆర్థికంగా నష్టపోయాడు. 5లక్షల కోసం అక్షర చిట్‌ఫండ్స్ చుట్టూ రెండేళ్లుగా తిరిగాడు. మరోవైపు రాజయ్యద్వారా చిట్ వేసినవారికి కూడా ఆసంస్థ డబ్బులు చెల్లించకుండా మోసంచేసింది. ఈ విషయాన్ని తన భార్యకు తరచుగా చెబుతూ బాధపడేవాడు. ఇదే విషయాన్ని తలుచుకుంటూ మనోవేదనతో శుక్రవారం అర్ధరాత్రి ఇంటివద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య వేకువజామున భర్తకోసం వెతకగా ఉరికి వేలాడుతూ కనిపించాడు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులున్నారు. అక్షర చిట్‌ఫండ్స్ డబ్బులు చెల్లించక పోవటంతో ఆర్థికంగా నష్టపోయిన తన భర్త కుంగిపోయి ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్యలావణ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. రాజయ్య ఆత్మహత్య విషయం తెలుసుకున్న అక్షరచిట్‌ఫండ్స్ బాధితులు పెద్దఎత్తున కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని అక్షర చిట్‌ఫండ్స్ సంస్థపై చర్యలు తీసుకుని తమకు రావాల్సిన డబ్బులను ఇప్పించి న్యాయం చేయాలని ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా అక్షరచిట్‌ఫండ్స్ బాధితులు గంప జగన్, గెల్లు ఐలయ్య యాదవ్ తదితరులు మాట్లాడుతూ అక్షర చిట్‌ఫండ్స్‌సంస్థ చిట్‌గడువు ముగిసినప్పటికీ తమకు రావాల్సిన డబ్బులు చెల్లించకుండా ఒత్తిడితెచ్చిన వారికి ఖాళీ చెక్కులు ఇచ్చి రెండేళ్లయినా చెల్ల కుండా పోయాయన్నారు. ఈ క్రమంలోనే ఏజెంట్ చింతల రాజయ్య తన 5 లక్షల డిపాజిట్ డబ్బులు, చిట్ డబ్బుల కోసం ఎంత ప్రయత్నించినా రాకపోవటంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డారని వాపోయారు.

ప్రజల సొమ్ముతో రియల్‌ఎస్టేట్ వ్యాపారం

అవసరాలకు ఉపయోగపడుతాయని ప్రతినెలా పొదుపు చేస్తూ అక్షర చిట్స్‌లో రిటైర్డ్‌ఉద్యోగులు, వికలాంగులు, వితంతువులు, చిరువ్యాపారులు చిట్‌వేసి బాధితులుగా మిగిలారు. మొదట చిట్ వేయించుకున్న అనంతరం వారికి డబ్బులు చెల్లించకుండా అధిక వడ్డీతో నమ్మబలికి అక్షర టౌన్‌షిప్ పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించుకుని గడువు ముగిసినా డబ్బులు చెల్లించకుండా మోసం చేశారు. కాళ్లు అరిగేలా తిరిగినవారికి అక్షర టౌన్‌షిప్ పేరిట చెక్‌లు ఇవ్వగా అవికూడా చెల్లకుండా పోయాయి. చివరకు కొందరికి అక్షర టౌన్‌షిప్‌లో స్థలాలను 4 రెట్లకు లెక్కచేసి అంటగట్టారు. అక్షర చిట్‌ఫండ్స్ సంస్థకు తెలంగాణ వ్యాప్తంగా 65 బ్రాంచిలు ఉన్నాయి. ఒక్కో బ్రాంచిలో 50 నుంచి 60కోట్ల వరకు చిట్ సభ్యులకు బాకీ ఉన్నట్లు బాధితులు చెబుతున్నారు. కరీంనగర్‌పోలీస్‌కమిషనర్ ఆదేశాలతో కరీంనగర్ జిల్లాలోని రెండు చోట్ల 14కోట్ల రూపాయల ఆస్తులను ఇటీవల ప్రభుత్వం అటాచ్‌మెంట్‌కు ఆదేశాలు జారీచేసింది. వరంగల్, ఖమ్మం ఇతర చోట్ల ఉన్న ఆస్తులను కూడా ప్రభుత్వం స్వాధీనం చేసుకుని న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

పేలుళ్లతో దెబ్బతింటున్న పంటలు

- డి2 కాలువ నిర్మాణ పనులతో ఇబ్బందులు పడుతున్నరైతులు
- హద్దులు దాటి పొలాల్లోకి మట్టి
- ఆందోళన వ్యక్తం చేస్తున్నరైతులు
- పట్టించుకోని అధికారులు


నాగిరెడ్డిపూర్‌లో లింక్2 కాలువ తవ్వకాలు

హద్దు దాటి పొలాల్లోకి వచ్చిన మట్టి

గంగాధర, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలో నాగిరెడ్డిపూర్ డీ-2కాలువ నిర్మాణ పనుల్లో భాగంగా చేపడుతున్న పేలుళ్లతో సమీప పొలాల రైతులు భయాదోళనకు గురవుతున్నారు. కాలువలో బండ రాళ్లను పగులగొట్టేందుకు ఉపయోగిస్తున్న భారీ పేలు ళ్లతో రాళ్ల ఎగిరిపడి సమీప పంటపొలాలు ధ్వంసమవుతున్నాయి. గంగాధర మండలం నాగిరెడ్డిపూర్ వరదకాలువ నుంచి రామడుగు మండలం దత్తోజీపేట మీదుగా చొప్పదండి వరకు లింకు2 కాలువ నిర్మిస్తున్నారు. కాలువలో తీసిన మట్టిని ఒడ్డుపై పోస్తున్నారు. కాలువకు భూములిచ్చిన హద్దులు దాటి మూడు మీటర్ల వరకు రైతుల పొలాల్లో మట్టిని పోస్తుండగా తీవ్రంగా నష్టపోతున్నామని బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువలో బండరాళ్ల పగుళ్లకు చేపట్టే పేలుళ్లతో రాళ్లు ఎగిరి వచ్చి పచ్చని పంటలు నాశనమవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వరిపొలాలు పొట్ట దశలో ఉండగా రాళ్లు పడి కర్రలు విరిగి పోతున్నాయని రైతులు తెలిపారు. ఈ విషయంపై నీటి పారుదల శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. పేలుళ్లకు పొలాలకు నీరు పెట్టా లన్నా, ఎరువులు చల్లాలన్నా భయంగా ఉందని రైతులు వాపోతున్నారు. తమ బాధను ప్రశ్నిస్తే కాలువ తవ్వే వారు బెదిరిస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పేలుళ్ల దాటి నుంచి పొలాలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

రాళ్లు పడటంతో.. భూమిని బీడుగానే వదిలేశా..



- పంజాల వేణు, రైతు, నాగిరెడ్డిపూర్


నాకు ఇక్కడ మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. నా భూమి మధ్య నుంచి కాలువ తవ్వుతున్నారు. బ్లాస్టింగ్‌తో రాళ్ల పడుతుండగా భూమిని దున్నకుండానే ఒకవైపు వదిలేశా. అటువైపు నీరున్న చోట పొలం వేయగా పేళుళ్ల దాటికి పంటపొలాల్లో రాళ్లు పడి కర్రలు విరిగిపోయి నష్టపోతున్నాం. అధికారులు పట్టించుకుని పొలాలను కాపాడాలి.

రైతులకు నష్టం జరగకుండా చూస్తాం..

- రఘురాం, ఏఈ నీటిపారుదల శాఖ

నాగిరెడ్డిపూర్ డి2 కాలువ నిర్మాణంలో రైతులకు నష్టం జరగకుండా చూస్తాం. మట్టి పోస్తుండగా కొంతజారి పొలంలో పడుతుందని రైతులు నా దృష్టికి తీసువచ్చారు. పొలాల్లో పడిన మట్టిని తీసి వేయించి రైతులకు ఇబ్బంది కలుగకుండా చూస్తాం.

అల్లాడుతున్న అన్నదాతలు



ఎల్లారెడ్డిపేట మండలం దేవునిగుట్టతండాలో ఎండిపోయిన వరి పైరును మేస్తున్న పశువులు

చిగురుమామిడి మండలం బొమ్మనపల్లిలో ఎండిపోయిన వ్యవసాయ బోరు

పొలమంతా పగుళ్లు చూపింది



- భూక్యా మహేశ్, యువ రైతు, దేవునిగుట్టతండా

మాకున్న మూడెకరాల్లో రూ.60వేలు బాకీలు చేసి వరి పంట వేశా. ఉన్న ఒక్క బోరుతో మూడెకరాలు పారేది. ఇప్పుడు నీళ్ల అందడం లేవు. పది రోజుల నుంచి పంటంతా పగుళ్లు చూపుతోంది. మరో వారం రోజుల్లో సాగు నీరు పెడితే పంట చేతికొస్తది. ఇప్పటికైనా అధికారులు స్పందించి 9వ ప్యాకేజీ కాల్వ ద్వారా సాగు నీరు అందించి పంటలను కాపాడాలే. చేసిన అప్పులు తీర్చే మార్గం కానరావడం లేదు.

15 ఏళ్లయినా వరద కాలువ పనులు పూర్తి కాలేదు

-తళ్ల నరేష్, ధర్మసమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్

నాడు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న కాలంలో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి చేపట్టిన వరద కాలువ పనులు నిలిచి పోయాయి. 15 సంవత్సరాలు గడిచినప్పటికీ పూర్తి కాలేదు. మండలంలోని అన్ని గ్రామాలకు పూర్తి స్థాయిలో సాగు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. మామిడి తోటలకు కూడా నీరు అందడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం వరదకాలువ పనులు పూర్తి చేసి మండలంలోని అన్ని గ్రామాల రైతులకు సాగు నీరు అందేలా చూడాలి. లేదంటే పంటలపై పెట్టుబడులు పెట్టి రైతులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతారు.

పశువులకు మేతగా వదిలేశా..



- భూక్యా హుస్సేన్, రైతు, దేవునిగుట్టతండా

నాకున్న ఆరెకరాల్లో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నా. గత రెండేళ్లలో రూ.4 లక్షల అప్పులు చేసి మూడు బోర్లు వేయించా. నీళ్ల మంచిగనే పడినయ్. బోర్లలో నీళ్ల ఉన్నాయని ఆరు ఎకరాల్లో రూ.1.20 లక్షల పెట్టుబడి పెట్టి వరి పంట వేశా. నెలకే బోర్లు ఎత్తేసినయ్. చిన్న ధారలా వస్తున్న నీళ్లతో తడులు పెడుతున్నా. మూడెకరాలకు సాగు నీరు అందక ఎండిపోయింది. పొలం ఎండిపోవడంతో పశువుల మేతకు వదిలేశా. బోర్లు, పంట పెట్టుబడికి రూ. 5.20 లక్షల దాకా బాకీల పాలయ్యా. ప్రభుత్వమే ఆదుకోవాలి.

ప్రభుత్వం ఆదుకోవాలి

- బొల్లోనిపల్లి ఎల్లవ్వ, రైతు, చిగురుమామిడి

బావుల్లో పూడిక తీయడానికి ప్రభుత్వం ఆదుకోవాలి. నాకున్న రెండు ఎకరాల భూమిలో వరి వేశాను. కనీసం ఇంకా నెలరోజులైనా నీళ్ల అవసరం ఉంది. సాగునీరు అందకపోవడంతో బావిలో పూడిక తీస్తున్నా. నీరులేక ఎండిన పంటలకు ప్రభుత్వం ఆర్థికసాయం అందించారు. కాలువ నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

ఎల్లారెడ్డిపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): వరిసాగు చేసిన రైతులకు ఆదిలోనే అరిగోస తప్పడం లేదు.

- అడుగంటిన భూగర్భ జలాలు..
- అందని సాగునీరు
- పంటలను కాపాడాలని రైతుల వేడుకోలు

భూగర్భ జలాలు అడుగంటడంతో ఎల్లారెడ్డిపేట మండలంలోని రాజన్నపేట, కిష్టునాయక్‌తండా, గుంటపల్లిచెరువుతండా, దేవునిగుట్టతండా తదితర గ్రామాల్లో పంటలు ఎండిపోతున్నాయి. పంటలకు సాగు నీరు అందించేందుకు ఇటీవల కోనరావుపేట మండలం మల్కపేట జలాశయం నుంచి 9వ ప్యాకేజీ కాల్వ ద్వారా నీటిని విడుదల చేసినా నాలుగు రోజులకే నిలిచిపోయింది. దాంతో ఆయా గ్రామాల్లోని సుమారు 2500ఎకరాల విస్తీర్ణంలో వరి పంటలు పగుళ్లు చూపాయి. మరో 2500 ఎకరాల్లో ఎండిపోయాయి. కళ్ల ముందే పంటలు ఎండిపోతుంటే కాపాడుకునేందుకు అన్నదాతలు పడరాని పాట్లు పడుతున్నారు. మండలంలోని గ్రామాల్లో నీటి వనరులు, వ్యవసాయ బోరుబావులపై ఆధారపడి సుమారు 4వేల మంది రైతులు మొత్తం 16,850 ఎకరాల విస్తీర్ణంలో వరి పంటను సాగు చేశారని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఎంతో ఆశతో సాగు చేసిన వరి పంటలకు సాగు నీరందకపోవడంతో ఆదిలోనే ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల్లో సుమారు 2 వేల ఎకరాల విస్తీర్ణంలో వరి పంటలు పగుళ్ల చూపగా, మరో 2వేల ఎకరాల్లో ఎండిపోయాయి. మిగిలిన పంటలను రక్షించుకునేందుకు రేయింబవళ్లు పొలాలకు తడులు పెట్టాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి 9వ ప్యాకేజీ కాల్వ ద్వారా సాగునీటిని అందించి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

పశుగ్రాసంగా మారుతున్న పంటలు..

- సాగునీరు అందక ఇబ్బందులు

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి, బొమ్మనపల్లి, ఉల్లంపల్లి, కొండాపూర్, నవాబుపేట, చిగురుమామిడి, లంబాడిపల్లి తదితర గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటి పంటలు ఎండుతున్నాయి. దీంతో చేసేదేం లేక రైతులు పంట పొలాలను పశుగ్రాసంగా వాడుతున్నారు. మెట్ట ప్రాంతంగా ఉన్న చిగురుమామిడి మండలంలోని ఇందుర్తి. రేకొండ, చిన్నముల్కనూర్, ఓగులాపూర్, పీచుపల్లి గ్రామాలకు మాత్రమే సాగు నీరు వస్తోంది. ఎండలు ముదురడంతో భూగర్భ జలాలు అడుగంటి సాగునీరు అందడం లేదు. పొలాలకు దాదాపు రెండు నెలలు సాగునీరు అందాల్సి ఉన్నది. పెట్టుబడి పెట్టి పంట సాగు చేసిన రైతులు అప్పులు తీసుకొచ్చి బావుల్లో పూడికతీత పనులు చేపడుతున్నారు. మండలంలో చాలా గ్రామాలకు సాగునీరు అందడం లేదు. మామిడి తోటలకు ప్రైవేటు ట్యాంకర్ల నీరు అందిస్తున్నారు. సాగునీటి ప్రాజెక్టుల పనులు పూర్తి కాకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో చేపట్టిన పనులు అర్ధంతరంగా నిలిచిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.



ట్యాంకర్‌తో మామిడి తోటకు నీరు పెడుతున్న రైతు

అందని ఎస్సారెస్పీ నీరు

మంథని/మంథనిరూరల్ : అందని సాగునీరు, మండుతున్న ఎండలతో మంథని ప్రాంతంలో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వేసవికాలంలో ముదురుతున్న ఎండలకు తోడు సాగునీరు సైతం అందక ఇప్పటికే వందల ఎకరాల్లో వరి పొలాలు బీటలు వారాయి. యాసంగి సాగులో వివిధ గ్రామాల్లోని వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయే ప్రమాదం ముంచుకొస్తుంది. మరోతడికి సాగునీరు విడుదల చేయకపోతే అన్నదాతలు నిండా మునిగే ప్రమాదం ఉంది. మండలంలోని కాకర్లపల్లి, సూరయ్యపల్లి, ఎక్లాస్‌పూర్ వంటి ఎస్సారెస్పీ కెనాల్ చివరి ఆయకట్టు గ్రామాల్లో సాగునీరు అందక వందలాది ఎకరాల్లో వరి పంటలు బీటలువారుతున్నాయి. దాదాపు నెలరోజుల క్రితం ఎస్సారెస్పీ కెనాల్ ద్వారా సాగునీరు విడుదల చేసిన అధికారులు అతర్వాత ముఖం చాటేశారు. ఓవైపు ఎండలు ముదురుతుండటం, మరోవైపు కెనాల్‌లో సాగునీరు విడుదల చేయకపోవడం, బోర్లలో సైతం సరిపడా నీరు అందడం లేదు. మరో 15 రోజులు ఇలానే కొనసాగితే పంటలు పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలు ఇప్పుడిప్పుడే పొట్టదశకు చేరుతున్నాయని ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఎస్సారెస్పీ కెనాల్ ద్వారా మరో తడికి నీరు అందించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



కాకర్లపల్లి గ్రామ శివారులో బీటలువారుతున్న పంట పొలాలు

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

వెల్గటూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పైడిపల్లి గ్రామంలో మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం కొనసాగుతోంది. ఇందులో భాగంగా శనివారం స్వామి వారి సుప్రభాత సేవ, స్వస్తివచనం, ఆవాహిత మంటప దేవతాపూజలు నిర్వహించారు. వివిధ ఔషధ సుగంధాది స్నపనములు, బింబ శుద్ధి కార్యక్రమాలు అర్చకుల మంత్రోచ్చరణల మధ్య నిర్వహించారు. శ్రీదేవిసహిత రుద్ర హోమము నిర్వహించిన అనంతరం తీర్థప్రసాద వితరణ చేశారు. సాయంత్రం మూర్తి హోమము, మూల మంత్ర హోమము, కళాహోమము నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



పైడిపల్లిలో పూజలు చేస్తున్న భక్తులు



తాట్లవాయిలో ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

- తాట్లవాయిలో..

రాయికల్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాట్లవాయి గ్రామంలోగల సీతారామచంద్రస్వామి ఆలయంలో శనివారం విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా జరిగాయి. ఆలయంలో సీతారామ, లక్ష్మణ, హనుమాన్ విగ్రహాలతో పాటు సంతాన నాగప్రతిష్ఠ, ఏకశిలా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు రంగాచార్యులు, మురళి, మదన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అక్కపల్లి రాజరాజేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు



దేవస్థానం హుండీ లెక్కింపు నిర్వహిస్తున్న భక్తులు

ధర్మపురి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్ర సమీపంలో గల అక్కపల్లి రాజరాజేశ్వరస్వామి దేవస్థానం హుండీ లెక్కింపు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హుండీ ద్వారా రూ 1,98,319 ఆదాయం లభించింది. అలాగే 11 విదేశీ నోట్లు లభించాయి. ఈ సంవత్సరం కళ్యాణం టిక్కెట్ల ద్వారా 1,82,000, ఇతర టిక్కెట్ల ద్వారా 60,574, హుండీల ద్వారా 1,98,319 మొత్తం ఆదాయం రూ 4,40,893 లభించింది. గత ఏడాది కన్న రూ 19,206 అధికంగా ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఎండోమెంట్ జగిత్యాల ఇన్‌స్పెక్టర్ రాజమౌళి, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు బూస ప్రవీణ్‌కుమార్, జన్మంచి శ్రీనివాస్, ఆలయ మాజీ చైర్మన్ సీపతి సత్యనారాయణ, గడ్డం భాస్కర్‌రెడ్డి, సంగి ఆనంద్, గడ్డం బోజిరెడ్డి, గంగారెడ్డి, రాజయ్య, తిరుమల సేవా గ్రూప్ కరీంనగర్ సభ్యులు, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

అల్లీపూర్‌లో రాజరాజేశ్వర స్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

రాయికల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలోని అల్లీపూర్ గ్రామంలో రాజరాజేశ్వర స్వామి రథోత్సవం శనివారం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా పురోహితులు అంగడి భువనేశ్వర్, అంగడి పరమేశ్వర్, గురులింగ మఠం వినయ్‌కుమార్, గురు లింగమఠం విక్రమ్‌ల మంత్రోచ్చరణల మధ్య రథోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు రథాన్ని లాగడానికి పోటీపడ్డారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అత్తినేని గంగారెడ్డి, మాజీ ఎంపీటీసీలు మోర విజయలక్ష్మివెంకటేష్, బాలె చంద్రశేఖర్, పీఏసీఎస్ చైర్మన్ రాజలింగం, జగిత్యాల రూరల్ సీఐ చిట్యాల భూమయ్య, నామని లక్ష్మీనర్సయ్య, సుమన్, శేఖర్, ప్రసాద్, శ్రీను, వేణురావు, రాజం పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా విడుదలకు సీఎం ఆదేశం

- టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి

జగిత్యాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ ఎక్స్‌గ్రేషియా నిధుల విడుదలకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారని టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ మంద భీం రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గల్ఫ్‌లో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తుందన్నారు. రాష్ట్రంలో 94 మంది బాధిత కుటుంబ సభ్యుల ఖాతాల్లో ఎక్స్‌గ్రేషియా సొమ్ము జమ చేయడానికి నిర్ణయం తీసుకోగా అందులో జగిత్యాల జిల్లాలో 31 మంది బాధిత కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా అందనుందన్నారు. గల్ఫ్ మృతుల కుటుంబాలను ఆదుకునేలా రూ. 5 లక్షల పరిహారం నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, ఇతర ప్రజాప్రతినిధులకు భీంరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ధర్మపురిలో భక్తుల రద్దీ

ధర్మపురి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. లక్ష్మీనరసింహస్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సుదూర ప్రాంతాల నుంచి క్షేత్రానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. పవిత్ర గోదావరి నదిలో భక్తులు స్నానాలు ఆచరించారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామిని భక్తులు దర్శనం చేసుకున్నారు. అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించి పూజలు చేశారు. రామలింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల రావి చెట్టు ఆంజనేయ స్వామి చుట్టు భక్తులు ప్రదక్షిణాలు చేశారు.. యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరిం టెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంప త్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఘనంగా పోచమ్మ బోనాలు



పోచమ్మ తల్లికి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

కోనరావుపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామంలో శనివారం పోచమ్మ తల్లి, దుర్గాంబిక దేవతల బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటి నుంచి పోచమ్మ, దుర్గమ్మ తల్లులకు బోనాలతో డప్పుచప్పుల మధ్య వెళ్లి నైవేద్యం చెల్లించారు. కుటుంబసభ్యులు, పాడిపంటలు బాగుండాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు నాయిని ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అనిల్, ఆనంద రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మల్లారెడ్డి, దుర్గారెడ్డి, లచ్చిరెడ్డి, బాపురెడ్డి, మాజీ సర్పంచ్ జిన్నా అనిల్, ఉప సర్పంచ్ కిషన్, భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కౌంటింగ్ కేంద్రంలోకి నంబర్-1 గేట్ నుంచి అనుమతి

- ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామి

కరీంనగర్ క్రైం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు సందర్భంగా ఈ నెల 3న కౌంటింగ్ కేంద్రంలోకి వెళ్లే కౌంటింగ్ ఏజెంట్లు, క్లరికల్ సిబ్బంది, మీడియా ప్రతినిధులకు అంబేద్కర్ స్టేడియం గేట్ నంబర్-1 నుంచి ప్రవేశానికి అనుమతిస్తారని కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ బి యాదగిరి స్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్టేడియంలోకి ప్రవేశించిన వారు నిర్దేశించిన ప్రాంతంలో వాహనాలను పార్క్ చేసి గేట్‌నంబర్ -4 ద్వారా ఇండోర్ స్టేడియంలోకి అనుమతిస్తారని తెలిపారు. కౌంటింగ్ కేంద్రం వద్ద భద్రతా చర్యల్లో భాగంగా ట్రాఫిక్ నియంత్రణ కోసం నిబంధనలు పాటించాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ, భద్రతాపరమైన చర్యలకు అందరూ సహకరించాలని కోరారు.

బాబ్లీ గేట్లు ఎత్తివేత

- గోదావరిలోకి 0.6 టీఎంసీల నీటి విడుదల

జగిత్యాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో గల బాబ్లీ ప్రాజెక్టు గేట్లను శనివారం అధికారులు తెరిచారు. ప్రాజెక్టు నుంచి 0.6 టీఎంసీల నీటిని దిగువన గల గోదావరిలోకి విడుదల చేశారు. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం తాగునీటి అవసరాల కోసం ఒక రోజు నీటిని విడుదల చేస్తున్నారు. మహారాష్ట్రలో గోదావరి నదిపై బాబ్లీ ప్రాజెక్టు నిర్మిస్తున్న సమయంలో ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో పిటీషన్లు వేయడంతో సంబంధిత ఉత్తర్వులు వచ్చాయి. దీని ప్రకారం ప్రతీ సంవత్సరం జూలై 1వ తేదీ నుంచి అక్టోబరు 29వ తేదీ వరకు బాబ్లీ నుంచి అధికారులు నీటిని విడుదల చేస్తుంటారు.

వేసవిలో ఎదురయ్యే నీటి ఎద్దడిని ఎదుర్కొవడానికి మార్చి 1న ఒక రోజు నీటిని విడుదల చేస్తారు. ఈ మేరకు బాబ్లీ ప్రాజెక్టు గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ఉదయం 9.30 గంటలకు ఐదు బాబ్లీ ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటి విడుదలను ప్రారంభించారు. 0.6 టీఎంసీల నీరు విడుదల కాగానే తిరిగి గేట్లను మూసివేస్తారు. కార్యక్రమంలో అధికారులు వెంకటేశ్వర్లు, చక్రపాణి, ప్రశాంత్, కొత్త రవి, సచిన్, విన్యాస్, సుశాంత్, రిక్కి, పలువురు బాబ్లీ ప్రాజెక్టు, ఎస్సారెస్పీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



బాబ్లీ ప్రాజెక్టు గేట్ల ద్వారా దిగువకు విడుదల అవుతున్న నీరు

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

(5వ పేజీ తరువాయి)

ప్రిన్సిపాల్స్ వి అంజనేయరావు, బి సత్య వర్ధన్‌రావు, జూనియర్ లెక్చరర్ శశిధర్‌శర్మ, హెచ్‌పీసీ మెంబర్ బి మధుమోహన్‌రావు, ప్రిన్సిపాల్ జేఎన్ ప్రమీల సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ పరీక్షల నిర్వహణను నిరంతరం పర్యవేక్షిస్తుంది. కలెక్టర్ పమేలా సత్పతి ఇప్పటికే ఇంటర్మీడియట్ పరీక్షలపై ఈ కమిటీ సభ్యులతోపాటు వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సలహాలు, సూచనలు చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో 37 పరీక్షా కేంద్రాలు ఉండగా ఇతర ప్రాంతాల్లో 21 కేంద్రాలను ఆయా ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, మోడల్, సోషల్ వెల్ఫేర్, మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పరీక్షా కేంద్రాలకు వెళ్లే విద్యార్థుల కోసం ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించింది. పరీక్షా సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144వ సెక్షన్‌ను అమలు చేస్తున్నారు.

● అవీఇవీ..

గణేశ్‌నగర్: ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్ కళాశాల వృక్షశాస్త్ర విభాగాధిపతి, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ తిరుక్కోవల శ్రీనివాస్ జాతీయ స్థాయి ఉత్తమ పరిశోధక అవార్డు అందుకున్న సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కల్వకుంట్ల రామకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ పి నితిన్, డాక్టర్ రాజయ్య అభినందించారు.

● కరీంనగ్ రూరల్: నగునూర్ గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించాలని శనివారం డీపీఓకు మాజీ సర్పంచ్ శ్రీధర్ వినతిపత్రం అందించారు.

● సుభాష్‌నగర్:జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ, ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరికి పండ్ల నరహరి జన్మదిన వేడుకలను నిర్వహించారు. పద్మశాలి ట్రస్టు భవన్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు మెతుకు సత్యం, గౌరవ అధ్యక్షుడు వాసాల రమేశ్ పాల్గొన్నారు.

● కరీంనగర్ కల్చరల్: నగరంలోని రెండు ఆలయాల హుండీలను శనివారం లెక్కించారు. పాతబజార్ గౌరీశంకరాలయం హుండీ 5,65,342 రూపాయలు, కమాన్‌రోడ్ రామేశ్వరాలయం 1,56,382 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఈఓ వెంకన్న తెలిపారు. తెలిపారు.

● కరీంనగర్ స్పోర్ట్స్: హైదరాబాద్‌లోని ఉప్పల్ శిల్పారామంలో శనివారం నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో నగునూరు పాఠశాల విద్యార్థులు గ్రాండ్ మాస్టర్ ఛాలెంజ్ ట్రోఫీని కైవసం చేసుకున్నారని ప్రధానోపాధ్యాయులు కట్ట రవీందర్ తెలిపారు.

● కరీంనగర్ అర్బన్: రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఉపవాసాలను జరుపుకోవాలని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు పేర్కొన్నారు.

● సుభాష్‌నగర్: ఆదర్శ హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్, ఇంపాక్ట్ గ్రూపు ఆఫ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ట్రాన్స్ జెండర్లకోసం వైద్య శిబిరం నిర్వహించారు.

విలీన గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

● మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్



సిబ్బందితో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

కరీంనగర్ రూరల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): విలీన గ్రామాల్లో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి పరిష్కరించేలా వార్డు ఆఫీసర్లు, పారిశుధ్య విభాగం అధికారులు చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ఆదేశించారు. విలీన గ్రామం దుర్శేడ్‌లో శనివారం ఆమె పర్యటించారు. వార్డు ఆఫీసర్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్, పారిశుధ్య విభాగం సిబ్బందితో కలిసి పలు వాడల్లో పర్యటించారు. పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. అనంతరం దుర్శేడ్ గ్రామం డంపింగ్ యార్డును పరిశీలించారు. డంపు యార్డు స్థలంతో పాటు స్థానికంగా ఉన్న డీఆర్‌సీసీ షెడ్డును కూడా తనిఖీ చేశారు. దుర్శేడ్ వార్డు కార్యాలయంను సందర్శించి వార్డు ఆఫీసర్, పారిశుధ్య అధికారులను పరిశుభ్రత పనులు తాగు నీటి సరఫరా తీరు, సమస్యలు, నీటి పన్నుల వసూళ్లపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పిన్ పాయింట్ పద్ధతి అనుసరించి కాలనీల్లో పరిశుభ్రత పనులను సక్రమంగా చేపట్టాలన్నారు. పరిసర ప్రాతాల్లో చెత్త లేకుండా పరిశుభ్రం చేయడంతో పాటు ఫిర్యాదులపై వెంటనే స్పందించి ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. డ్రైనేజీల్లో సిల్టు తొలగించి, డ్రైనేజీల వెంబడి ఉన్న చెత్త చెదారం కలుపు మొక్కలను తొలగించాలన్నారు. దుర్శేడ్ డంపు యార్డును వినియోగించి చెత్తను అక్కడే డంపు చేయలన్నారు. డంపు యార్డు సమీపంలో ఉన్న డీఆర్‌సీసీ రోడ్డు నిర్వహణ చేపట్టి చెత్తను వేరు చేసిన తరువాతే డంపునకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దుర్శేడ్‌లో తాగు నీటి సరఫరా సమయం ప్రకారం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. నీరు వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాగు నీరు, పారిశుధ్యం విషయంలో ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా స్పందించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. మంచినీటి పన్నులను వసూలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ స్వామి, వార్డు ఆఫీసర్, పారిశుధ్య విభాగం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

గణేశ్‌నగర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మైనార్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని శాసనమండలి సభ్యుడు అమీర్ అలీఖాన్ అన్నారు. యునైటెడ్ తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఫర్ మైనారిటీస్ వాల్ క్యాలెండర్‌ను శనివారం ఆయన ఆవిష్కరించారు. యునైటెడ్ టీమ్ క్రియాశీల సభ్యుడు మొహ్మద్ అఖిల్ అహ్మద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ టీం రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ షేక్ నిసార్ అహ్మద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ గులాం హక్కానీ, సయ్యద్ అసద్ టెక్నికల్ ఆఫీసర్, మహమ్మద్ నసీరుద్దీన్, అయూబ్‌ఖాన్, అహ్మద్ పాషా, మహమ్మద్ హాజీ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ పండుగకు నిత్యావసర సరుకుల పంపిణీ

కరీంనగర్ అర్బన్, మార్చి 1(ఆంధ్ర జ్యోతి): రంజాన్ పండుగ నేపథ్యంలో పేద ముస్లింలకు యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ అజీమ్ ఆధ్వర్యంలో శనివారం నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. కరీంనగర్ 14వ డివిజన్‌లోని కోహినూరు బంకెట్ హాల్‌లో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అజీమ్ మాట్లాడుతూ రంజాన్ మాసం సందర్భంగా పేదలకు నెల రోజులకు సరిపడా నిత్యావసర వస్తువులు, 25 కిలోల బియ్యం, చక్కెర, వంటనూనె, మిర్చి పౌడర్, చాయ్ పత్తా, ఉప్పు, పప్పు దినుసులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అబ్దుల్ ఖదీర్, అబ్దుల్ అజీజ్, అబ్దుల్ బారీ, జాకీర్, అబ్దుల్ ఖదీర్, అబ్దుల్ బారీ జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఇబ్బందిపెడుతున్న కళాశాలపై చర్య తీసుకోవాలి

గణేశ్‌నగర్, మార్చి1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థిని ఆకారణంగా కొట్టి ఇబ్బందులకు గురిచేసిన ట్రినిటీ కళాశాల ప్రిన్సిపాల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కార్యదర్శి సంద గణేష్ జిల్లా ఇంటర్మీడియట్ అధికారిని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల యజమాన్యం విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారన్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు.

కళాశాలలోని సమస్యలపై సమగ్ర విచారణ జరిపి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై దాడి చేసిన ప్రిన్సిపాల్‌పై కేసు నమోదు చేయాలని అన్నారు. లేకపోతే జిల్లా ఇంటర్మీడియట్ కార్యాలయం ముట్టడి స్తామని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్ , మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా ఆదివారం ఉదయం 9:30 నుంచి 11:30 వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ త్రీ, ఏడీఈ, పంజాల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిపివేయు ప్రాంతాలు కోర్టు కాంప్లెక్స్, కోర్టు వెనుక వైపు, కెమిస్ట్‌భవన్, శివ థియేటర్ ప్రాంతం, వెంకటేశ్వర ఆలయ ప్రాంతం, వావిలాలపల్లి, హోండా షో రూమ్ ప్రాంతం, ఎస్ఈ ఆఫీస్ కాంపౌండ్ ప్రాంతం. ఉదయం 9గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయు ప్రాంతాలు మారుతి నగర్, పాతబజార్, వెంకటసాయిరోడ్డు, శోక్‌నగర్, గౌరీ శంకర్ కాంప్లెక్స్, ఎన్ఎన్ గార్డెన్ రోడ్డు. ఉదయం 9:30 నుంచి 11:30 వరకు విద్యుత్ విద్యుత్ సరఫరా నిలిపి వేయు ప్రాంతాలు బోయవాడ, లక్ష్మీనగర్, రాఘవేంద్రనగర్ ప్రాతాలు.

వర్గీకరణతోనే అమరుల ఆత్మకు శాంతి

సుభాష్‌నగర్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్లలో జనాభా దామాషా ప్రకారం వర్గీకరణ అమలు జరిగినపుడే మాదిగ అమరుల ఆత్మకు శాంతి కలుగుతుందని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ అన్నారు. శనివారం స్థానిక కోర్టు చౌరస్తాలోగల అంబేద్కర్ విగ్రహం వద్ద మాదిగ అమరుల సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మార్చి 1న మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్పీ, డప్పు కళాకారుల నాయకులు బోయిని కొమురయ్య, అంబాల ప్రభాకర్, దండు అంజయ్య, సముద్రాల అజయ్, చెంచాల నవీన్, గోష్కి శంకర్, తాంద్ర శంకర్, ఆలువాల సంపత్, దండు వరలక్ష్మి, గడ్డం కొమురమ్మ, ఎలుకపెల్లి పోలు, గసికంటి కుమార్ పాల్గొన్నారు.

స్టేట్ టాపర్లుగా ప్రతిమ మెడికల్ కళాశాల విద్యార్థులు

● సన్మానించిన కళాశాల యజమాన్యం

కరీంనగర్ రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జనరల్ మెడిసిన్‌లో తెలంగాణ స్టేట్ టాపర్‌లుగా నిలిచిన కరీంనగర్ మండలంలోని నగునూర్ ప్రతిమ మెడికల్ కళాశాల విద్యార్థులను శనివారం కళాశాలలో అభినందించారు. డాక్టర్ నరహరి కావ్య, డిపార్ట్‌మెంట్ ఆఫ్ రేడియాలజీలో తెలంగాణ టాపర్‌గా నిలిచిన డాక్టర్ వంటేరు ప్రణవ్‌రెడ్డిని కళాశాల డీన్ అచంట వివేకానంద, డాక్టర్ జాన్ ఇస్రాయల్, మెడికల్ సూపరింటెండెంట్, డాక్టర్ రవీందర్‌రెడ్డి, హెచ్‌ఓడీ ఆఫ్ జనరల్ మెడిసిన్ డాక్టర్ చెన్నమనేని వికాస్, హెడ్‌ఆఫ్‌ది డిపార్ట్‌మెంట్ ఆఫ్ రేడియాలజీ, సీఏఓ రాంచందర్‌రావు, రిజిస్ట్రార్ అండ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ప్రసాద్‌రావు విద్యార్థులతో పాటు వారి కుటుంబ సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రతిమ హాస్పిటల్ వైద్యులు, వైద్య విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానిస్తున్న ప్రతిమ కళాశాల డీన్ తదితరులు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు కాంగ్రెస్ పార్టీదే

● పట్టభద్రుల అభ్యర్థి నరేందర్‌రెడ్డి



చాయ్ తాగుతూ కార్యకర్తలతో మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, మార్చి 1 (ఆంధ్రప్రదేశ్): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు కాంగ్రెస్ పార్టీదేనని, కార్యకర్తలంతా సంబరాలకు సిద్ధం కావాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్ ప్రాంతంలోని ఓ హోటల్ వద్ద కార్యకర్తలతో సరదాగా చాయ్ తాగుతూ చిట్ చాట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ రాకముందు నుంచే ఉమ్మడి జిల్లా పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో ఉద్యోగ, నిరుద్యోగ పట్టబద్రులను ప్రత్యక్షంగా కలిసినట్లు తెలిపారు. బీజేపీ, బీఎస్పీ పార్టీల అభ్యర్థులు సోషల్ మీడియా వేదికగా తనపై చేసిన ఆరోపణలను, విషప్రచారాన్ని పట్టభద్రులు నమ్మలేదని అన్నారు. తన ప్రచారంలో అల్ఫోర్స్ కుటుంబ సభ్యులతో పాటు, కాంగ్రెస్ శ్రేణులు అంతా కష్టపడి తనకు మద్దతుగా నిలిచారన్నారు.

ఎస్‌పీఆర్‌లో వీడ్కోలు వేడుకలు



నృత్యం చేస్తున్న విద్యార్థినిలు

కరీంనగర్ రూరల్, మార్చి1(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలోని ఎస్‌పీఆర్ స్కూల్‌లో శనివారం వీడ్కోలు వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమానికి ప్రముఖ వక్త ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కె శ్రీనివాస్ తమ అమూల్యమైన సందేశాన్ని విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ డాక్టర్ యం విజయమోహన్ రెడ్డి, కరస్పాండెంట్ డాక్టర్ ఆర్ యాకయ్య, డైరెక్టర్‌లు డాక్టర్ పీఆర్ రాజేందర్, డాక్టర్ జి ప్రశాంత్, డాక్టర్ కె శ్యాంసుందర్, మేనేజింగ్ డైరెక్టర్ బి ఉపేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె చుక్కారెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

సౌర కుటుంబంపై విద్యార్థులకు అవగాహన



సౌర కుటుంబంలోని గ్రహాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కరీంనగర్ స్పోర్ట్స్ మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మెహర్ నగర్ వింధ్యావాలీ పాఠశాలలో చిన్నారులకు సౌర కుటుంబంపై అవగాహన కల్పించారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమాన్ని పాఠశాల ఛైర్మన్ రామవరం లక్ష్మీప్రకాష్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులు సోలార్ సిస్టంలోని గ్రహాలు, తోకచుక్కలు, ఆస్టరాయిడ్లు, ఉల్కలు, తదితర అంతరిక్ష వస్తువులను రూపొందించి ప్రదర్శించారు. కార్యక్రమంలో వింధ్యావాలీ ఉన్నత పాఠశాల వైస్ ఛైర్మన్ రామవరం పృథ్వీరావు, ప్రిన్సిపాల్ జి ప్రశాంత్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే



సీఎం రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, విప్ లక్ష్మణ్

గంగాధర,మార్చి1(ఆంధ్రజ్యోతి): చొప్పదండి నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తానని ఎమ్మెల్యే మేడిపల్లిసత్యం అన్నారు. శనివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చొప్పదండి నియోజకవర్గంలోని పెండింగ్‌ప్రాజెక్టులను పూర్తిచేయడానికి నిధులుమంజూరు చేయాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు ఆయన ఫోన్‌లో తెలిపారు.

ఉపాధ్యాయ వృత్తి ఒక వరం: డీఈవో

గంగాధర, మార్చి1 (ఆంధ్రజ్యోతి): సమాజంలో బావిభారత పౌరులను తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి వరంలాంటిది అని డీఈవో జనార్దన్‌రావు అన్నారు. మండలంలోని ఒద్యారంపాఠశాలలో స్కూల్‌అసిస్టెంట్ ఇంగ్లీష్ టీచర్ పాలోజు రవీందర్ ఉద్యోగవిరమణ సన్మానసభను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన డీఈవో ఆయనను సన్మానించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్ రావు, విజయలక్ష్మి, ఎస్‌టీయూ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ చందూరి రాజిరెడ్డి, టీపీయూఎస్ జిల్లాఅధ్యక్షుడు రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుడికి సన్మానం

సైదాపూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకునూర్ జడ్పీ ఉన్నతపాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న శాంతకుమార్ సింగ్ పదవీ విరమణ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా శాంతకుమార్‌సింగ్-రాణిజయప్రద దంపతులను ఉపాధ్యాయులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, మండల నోడల్ అధికారి కట్ట రవీంద్రచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైన్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

హుజూరాబాద్‌రూరల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ప్రతివిద్యార్థి, అధ్యాపకుడు సైన్స్‌పై అవగాహన కలిగి ఉండాలని ఎన్ఐటీ భౌతికశాస్త్ర ప్రొఫెసర్, డాక్టర్ సౌరబ్‌రాయ్ అన్నారు. మండలంలోని సింగాపూర్‌లోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయసైన్స్‌డేను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. కంప్యూటర్‌రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరయ్య రిజిస్ట్రార్ డాక్టర్ రాజేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

ఆపదలో ఉన్న గర్భిణీని ఆదుకున్న ఆసరా ఫౌండేషన్

గణేశ్‌నగర్, మార్చి1 (ఆంధ్రజ్యోతి): మాతాశిశు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కరీంనగర్‌కు చెందిన ఓ గర్భిణీకి ఆసరా ఫౌండేషన్ సభ్యుడు కె.సంజీవరావు రక్తదానం చేసినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ రాపోలు గోపికృష్ణ తెలిపారు. ఆమెకు డెలివరీ నిమిత్తం అరుదైన ఏబీపాజిటివ్ రక్తం అవసరం కావడంతో రక్తదానం చేసినట్లు తెలిపారు.

మట్టి తరలింపును అడ్డుకున్న రైతులు

మానకొండూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారం జవహర్‌పేట్ కుంట నుంచి మట్టి తరలింపును శనివారం రాత్రి రైతులు అడ్డుకున్నారు. వారం రోజులుగా ట్రాక్టర్లు, టిప్పర్‌ల ద్వారా మట్టిని మానకొండూర్, అల్గునూర్, కరీంనగర్‌కు అక్రమంగా తరలిస్తున్నారని రైతులు పేర్కొన్నారు. మట్టి తరలింపును సంబందిత అధికారులకు తెలిజేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాక్టర్లు, టిప్పర్లలో మట్టిని పోసే ఎక్స్‌కావేటర్‌ని అడ్డుకోవడంతో వాటి డ్రైవర్లు పారిపోయినట్లు వారు తెలిపారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలి



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

గన్నేరువరం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గునుకుల కొండాపూర్ నెప్రశాచౌరస్తాలో రోడ్డు పక్కన ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే తొలగించాలని గ్రామస్థులు శనివారం నిరసన చేపట్టారు. నిత్యంరద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ చిన్నపిల్లలకు సైతం చేతికి అందేస్థితిలో కిందకి ఉందన్నారు. ఆదమరిచి ఎవరైనాతాకితే ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే స్పందించి నిత్యం రద్దీగా ఉండేప్రాంతంలో ప్రమాదభరితంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు సిందె తిరుపతి, బోయిని సమ్మయ్య, గుండశ్రీనివాస్, దొమ్మటి శంకర్, తాళ్ళపల్లిసంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

వీణవంక, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన మాజీజడ్పీటీసీ ఆనందరాజమల్లు ఇటీవల ఆత్మహత్య చేసుకోగా వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు.

కృష్ణన్ వర్ధంతి

హుజూరాబాద్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తపాలా కార్యాలయంలో జాతీయతపాలా ఉద్యోగుల సమాఖ్య మాజీఉన్నత కార్యదర్శి కృష్ణన్ వర్ధంతి శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పోస్టల్ ఉద్యోగుల సంఘం రాష్ట్రఅధ్యక్షుడు ఊకంటి మహేందర్, అమర్నాథ్‌రెడ్డి, జక్కురజినీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

'ముదిరాజ్ సంఘం జెండా కిందపడడం బాధాకరం'

చిగురుమామిడి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎమ్మెల్సీఎన్నికల సందర్భంగా జరిగిన సంఘటనలో ముదిరాజ్‌సంఘం జెండాలు కింద పడడం బాధాకరమని ముదిరాజ్‌సంఘం, బీజేపీ నాయకులు పొన్నం శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ పోలింగ్ సందర్భంగా కాంగ్రెస్‌పార్టీకిచెందిన మాజీప్రతినిధికి చెందిన వాహనంలో డబ్బులు పంపిణీ చేస్తున్నారనే సమాచారం మేరకు బీజేపీ నాయకులుగా వెళ్లి నిలదీశారు. ఈ క్రమంలో సదరువాహనంలో ఉన్న ముదిరాజ్ సంఘానికిచెందిన జెండా అనుకోకుండా కిందపడడం బాధాకరమన్నారు.

ముదిరాజ్ సంఘం నాయకులు పెద్ద మనసుతో అర్థం చేసుకోవాలన్నారు.

'రైతు కుటుంబానికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి'

చొప్పదండి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని భూపాల పట్నం గ్రామానికి చెందిన రైతు గుర్రం దేవేందర్ రెడ్డికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఆర్నకొండలో మాట్లాడుతూ రైతు గుర్రం దేవేందర్ రెడ్డికి 2022లోనే పట్టాదారుపాస్‌బుక్ జారీ అయినప్పటికీ రైతుబీమా పథకంలో పేరునమోదు చేయకపోవడంతో రూ.5లక్షల బీమా పరిహారం అందలేదన్నారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు మొగిలి మహేష్, తొట్ల తిరుపతి, గుడిపాక సురేష్, గొల్ల గట్టయ్య, బైనగొని కిట్టుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే.. అంతే!



చల్లూరు- కిష్టంపేట గ్రామాల మధ్య రోడ్డు పక్కనే ప్రమాదకరంగా వ్యవసాయ బావి

వీణవంక, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జమ్మికుంట ప్రధాన రహదారిపై వ్యవసాయ బావులు ప్రమాదకరంగా ఉన్నాయి. మామిడాలపల్లి, చల్లూరు, కిష్టంపేట గ్రామాల మధ్యలో కరీంనగర్- జమ్మికుంట ప్రధానరహదారి పక్కనే వ్యవసాయబావులు ప్రమాదకరంగా ఉన్నాయి. వీటికి కనీస హెచ్చరిక బోర్డులు పెట్టడం కానీ, బావులకు అడ్డుగా ఎత్తుగా గోడకానీ నిర్మించలేదు. దీంతోప్రయాణికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణం చేస్తున్నారు. రాత్రివేళలో ప్రయాణం మరింత ప్రమాదకంగా మారింది. మరో పక్కరోడ్డుఅంచున చెట్లపొదలు ఉంటున్నాయి. ద్విచక్ర వాహనదారులు వెళ్లేటప్పుడు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. అధికారులు వెంటనే స్పందించి సూచికలు ఏర్పాటుతోపాటు వ్యవసాయ బావులకు అడ్డంగాగోడ కట్టించాలని, రోడ్డుపక్కన పెరిగిన చెట్లపొదలను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

ఘనంగా మాదిగ అమరవీరుల దినోత్సవం

హుజూరాబాద్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తావద్ద ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకుల ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల దినోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణ కోసం చేసిన ఉద్యమంలో మృతిచెందిన మాదిగల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బండశ్రీనివాస్, రామచంద్రం, వసంత్,రమేష్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జీ కొడూరి మహేష్ ఆధ్వర్యంలో మాదిగఅమరవీరుల చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆడెపు నర్సయ్య, దాసరపు భద్రయ్య, కొంద్ర రాజయ్య, బొజ్జరవి, దేవునూరి కృష్ణయ్య, అంతడుపులసతీష్, పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండలకేంద్రంలో అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. మండల అధ్యక్షుడు దొబ్బలబాబు, కాత మల్లయ్య, తిరుపతి, ఎడెల్లి సంపత్‌కుమార్, అనిల్, అంజయ్య, సుధాకర్, ప్రసాద్‌తోపాటు అన్ని గ్రామాల మాదిగా దండోరా సంఘల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు

గంగాధర, మార్చి1(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదివితే ఉత్తమఫలితాలు సాధించవచ్చని నరేంద్ర విద్యాలయం ప్రిన్సిపాల్ రాజేశం అన్నారు. శనివారం పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పదవతరగతి విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన సంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.

ఉచిత వైద్యశిబిరం

చొప్పదండి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్నకొండలో హనుమాన్‌రెడ్డి సంక్షేమసంఘం ఆధ్వర్యంలో ఫార్చున్ మెడికేర్ హాస్పిటల్ శనివారం ఉచితవైద్యశిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మణిశంకర్‌రెడ్డి,ఎల్లాల శ్రీనివాస్‌రెడ్డి, గోపుజనార్దన్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఆలయానికి దాతల విరాళం

తిమ్మాపూర్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో ముదిరాజ్‌లకు చెందిన గీకురు మల్లయ్య ఆలయానికి మండల మాజీవైస్‌ఎంపీపీ మనపల్లి శ్రీనివాసరావు రూ.21వేలు, బ్లాక్ కాంగ్రెస్‌అధ్యక్షుడు ఎస్ఎల్‌గౌడ్ రూ.10వేలు విరాళం అందజేశారు.

ఆస్తిపన్ను వెంటనే చెల్లించాలి

చొప్పదండి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఆర్థికసంవత్సరం 2024-25ముగుస్తున్నందున పట్టణంలో ఆస్తిపన్ను, నీటిపన్ను బకాయిలు, లైసెన్స్ ఫీజు వెంటనే చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ నాగరాజు తెలిపారు. ఈనెల31లోగా చెల్లించనియెడల చట్టంప్రకారంచర్యలు తీసుకుంటామన్నారు.

పరీక్ష ప్యాడ్స్ పంపిణీ

వీణవంక, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కేజీబీవీ, జమ్మికుంట, ఇల్లంతకుంట, వీణవంక పాఠశాలలో చదువుతున్న 150మంది పదవతరగతి విద్యార్థులకు యూఫ్‌టీవీ సీఈవో ఉదయనందన్ రెడ్డి జన్మదినం సందర్భంగా పరీక్ష ప్యాడ్స్ పంపీణీ చేశారు.

జన్మదిన వేడుకలు

జమ్మికుంటరూరల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివాలయంలో మధ్యప్రదేశ్ వైద్యఆరోగ్యశాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ పరికిపండ్ల నరహరి(ఐఏఎస్) జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. శివాలయంలో ప్రత్యేక పూజలు, అన్నదానం చేశారు.

ఆర్థికసాయాలు..

తిమ్మాపూర్, మార్చి1(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని మల్లాపూర్‌లో ఓ పేదింటి ఆడబిడ్డ వివాహానికి బీఆర్ఎస్ నాయకులు ముందుకువచ్చి రూ.45వేలు ఆర్థిక సాయంచేసి ఆదుకున్నారు. గ్రామానికి చెందిన మడ్డిఉమ-సంపత్ దంపతుల పెద్ద కూతురు వివాహం నిశ్చయం కాగా ఆర్థిక పరిస్థితి సరిగాలేకపోవడంతో బీఆర్ ఎస్ నాయకులు ముందుకొచ్చి సాయంచేశారు.

వీణవంక: మండల కేంద్రానికి చెందిన వంగళ గణేష్ అనారోగ్యానికి గురికాగా వారి కుటుంబానికి అమృత ప్రభాకర్ ఐదువేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. గ్రామస్థులు, ఆటో యూనియన్ సభ్యులు కలిసి రూ.40,000వేలు అందించారు.

చొప్పదండి: మండలంలోని భూపాల పట్నం గ్రామానికిచెందిన గుర్రం దేవేందర్ రెడ్డి కొద్దిరోజుల కిందట గుండెపోటుతో మృతిచెందగా, ఆయనస్నేహితులు కుటుంబానికి రూ.41వేలసాయాన్ని అందజేశారు.